## రైతులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

- ఆదిలాబాద్‌లో రైతన్నలపై లాఠీచార్జి దారుణం
- ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ దాడి
- బాధ్యులైనవారిపై కేసులు పెట్టాలి.. చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం బారులుతీరిన రైతులపై లాఠీచార్జి అత్యంత దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది రైతన్నలపై ప్రభుత్వ దాడి అని మండిపడ్డారు. రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని, లాఠీచార్జి చేసిన అధికారులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతన్నలపై ప్రభుత్వ దాడులను బీఆర్ఎస్ పార్టీ సహించబోదని మంగళవారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. రాష్ట్రంలో రైతులపై దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉండటం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రాజకీయాలను పక్కన పెట్టి రైతన్నల సమస్యలను పట్టించుకోవాలని, వెంటనే ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే రాష్ట్రంలో వ్యవసాయరంగం ముఖ్యంగా రైతన్నల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఐదు నెలల్లోనే రాష్ట్రం వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టంచేశారు. సాగునీరు, రైతుబంధు పెట్టుబడి సహాయం, చివరకు కనీసం విత్తనాలు అందించలేని దుర్మార్గ పూరిత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని దుయ్యబట్టారు. రైతన్నలపై లాఠీచార్జి పేరుతో దాడులు చేయడమే కాంగ్రెస్ పార్టీ చెప్పిన మార్పా? అని ప్రశ్నించారు. గత పదేండ్లుగా రాష్ట్ర రైతాంగం ఎలాంటి ఆందోళన పడకుండానే విత్తనాలు, ఎరువులు, 24 గంటల ఉచిత విద్యుత్తు, పెట్టుబడి సాయం.. ఇలా తమకు కావాల్సినవన్నీ సాఫీగా అందుకున్నదని గుర్తుచేశారు. ఐదు నెలల్లోనే పరిస్థితి పూర్తిగా తారుమారు అయిందని, ఇది పూర్తిగా ప్రభుత్వ పరిపాలన వైఫల్యమని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికే రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, విత్తనాలు కూడా అందించలేని నిస్సహాయ స్థితికి చేరుకున్నదని విమర్శించారు. రైతులపై ప్రభుత్వ దాడులను సహించేది లేదని, అవసరమైతే బీఆర్ఎస్ పార్టీ తరఫున విస్తృతమైన నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తామని ప్రకటించారు.

## విత్తనాలు అడిగితే లాఠీలతో కొడుతరా?

- ఐదు నెలల్లోనే రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి
- కాంగ్రెస్ తెస్తానన్న మార్పు ఇదేనా?
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు




హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ) : 'ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం బారులు తీరిన రైతులపై లాఠీలు ఝుళిపించడం దారుణం, అత్యంత బాధాకరం. కాంగ్రెస్ పాలనలో రైతుల బతుకులు ఆగమైనయ్. ఐదు నెలల్లోనే రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చింది. కాంగ్రెస్ తెస్తానన్న మార్పు ఇదేనా?' అని ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం ప్రశ్నించారు. సాగునీరు, కరెంటు మాత్రమే కాదని, విత్తనాలను కూడా రైతులకు అందించలేని దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం చేరిందని దుయ్యబట్టారు. రైతులపై లాఠీలు ఝుళిపించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందుల్లేకుండా విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

### మానుకోట జ్ఞాపకానికి 14ఏండ్లు

తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో మానుకోట ఘటన ఓ చారిత్రాత్మక సందర్భమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఆ ఘటన జరిగి మంగళవారానికి 14ఏండ్లు అంటూ ఎక్స్ వేదికగా గుర్తుచేసుకున్నారు. ఆధిపత్య అహంకారంతో తుపాకులు ఎక్కుపెట్టిన అప్పటి పాలకులకు మానుకోట రాళ్లే సమాధానం చెప్పాయన్నారు. తుపాకీ తూటాలకు దీటుగా తిరగబడ్డాయని, పోలీసుల బుల్లెట్లకు ప్రతిస్పందిస్తూ ఉద్యమ కారులు చూపిన తెగువకు సమైక్య పాలకులు వెనుదిరుగక తప్పలేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమ ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నాన్ని మానుకోట మట్టి సాక్షిగా ఉద్యమకారులు ఏకమై తిప్పికొట్టారని కొనియాడారు. స్వరాష్ట్ర ఆకాంక్షను మరోసారి బలంగా చాటిచెప్పారని, తుపాకీ తూటాలకు కూడా వెరవలేదని, లాఠీలకు భయపడలేదని గుర్తుచేశారు. ఆ చారిత్రక సన్నివేశాలు ఇంకా తన కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయని, చరిత్రపుటల్లో అవి చిరస్థాయిగా నిలిచిపోతాయని, భవిష్యత్ తరాలకు ఉద్యమ స్ఫూర్తిని చాటుతాయని పేర్కొన్నారు.

### లోకం పోకడ




మన జాబ్ క్యాలెండర్‌లో డిసెంబర్ 32 చేర్చాం సార్!

# అన్నదాతపై పోలీసు లాఠీ

- ఆదిలాబాద్‌లో రైతులపై ఖాకీల చిందులు
- పత్తివిత్తనాల కోసం ఓ సెంటర్ వద్ద ఉద్రిక్తత
- లాఠీలతో చెదరగొట్టిన పోలీసులు
- బందోబస్తు నడుమ అరకొర పంపిణీ
- రాష్ట్రమంతటా విత్తనాల కోసం వెతలు
- వృద్ధుల నుంచి పిల్లల దాకా క్యూ
- తిండీ తిప్పలు లేక పడిగాపులు
- జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలకూ పాట్లు



మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విత్తనాల కోసం ఉదయం నుంచి బారులు తీరిన రైతులు, మహిళలు



సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలకేంద్రంలో విత్తనాలకోసం పాస్‌బుక్కులు క్యూలో ఉంచిన రైతులు

ఆదిలాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ)/ నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 28 : దుక్కులు సిద్ధం చేసి, విత్తనాల కోసం పోతే రైతులకు నరకయాతన తప్పడం లేదు. ఆదిలాబాద్‌లో మంగళవారం పత్తివిత్తనాల కోసం ఎండను లెక్కచేయకుండా గంటల తరబడి బారులు తీరిన రైతులపై పోలీసులు చిందులు తొక్కారు. ఒకానొక దశలో తోపులాట జరగడంతో లాఠీలతో చెదరగొట్టారు. ఆరురోజులుగా ఎదురుచూస్తున్న ఆర్‌సీహెచ్ 659 రకం పత్తి విత్తనాల స్టాక్ మంగళవారం వచ్చిందని తెలిసి వేలాది మంది రైతులు ఉదయం ఆరు గంటల నుంచే పలు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తిండీ తిప్పలు లేక లైన్లలో నిరీక్షించారు. చాలా దుకాణాలను స్టాక్ లేదని మూసేయడంతో ఓ సెంటర్ వద్దకు రైతులు ఒక్కసారిగా దూసుకువచ్చారు. కొంత తోపులాట జరగడంతో పోలీసులు వచ్చి లాఠీలతో అదిలించారు. పెద్ద సంఖ్యలో పహారాకాస్తూ విత్తన విక్రయాలను కొనసాగించారు. కేంద్రాల వద్ద ఆధార్ కార్డులతో మహిళా రైతులు, వృద్ధులు, యువకులు, పిల్లలు సైతం విత్తనాల కోసం క్యూ కట్టారు. మండుటెండలో తిండీ తిప్పలు మరిచి, కనీసం తాగునీరు, నీడ వసతి లేక ఇబ్బందులు పడ్డారు.

### గంటలోనే అయిపోయిన విత్తనాలు

పత్తి విత్తనాల కోసం దాదాపు 4గంటల దాకా క్యూ కట్టినా ఒక్కో రైతుకు వ్యాపారులు 2ప్యాకెట్లు మాత్రమే విక్రయించారు. కొన్ని దుకాణాల్లో గంటలోనే విత్తనాలు అయిపోవడంతో చాలామందికి నిరాశతో వెనుదిరిగారు. స్టాక్ తక్కువ ఇచ్చారని, మొత్తం అమ్మేశామని వ్యాపారులు అమ్మకాలు నిలిపివేయడంతో రైతులు మరో దుకాణం వైపు పరుగులు తీయడం కనిపించింది. ఒక్కొక్కరికి 5 నుంచి 8 ప్యాకెట్లు అవసరముంటే కేవలం రెండే ఇస్తే ఎలా అని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో దుకాణాలు ఎక్కువగా ఉండే గాంధీచౌక్ ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

### మార్పు అంటే లాఠీచార్జేనా?

- ఎరువులు, విత్తనాలపై శ్వేతపత్రం విడుదల చేయండి
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు అంటే లాఠీ చార్జీయేనా? అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం వచ్చిన రైతులపై జరిగిన లాఠీచార్జీని మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. రైతులపై లాఠీచార్జి అమానుషమని, పాలనను గాలికి వదిలేసి మంత్రులు, ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారని దుయ్యబట్టారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఏయే జిల్లాల్లో ఎరువులు, విత్తనాలు ఎంత ఉన్నది శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పత్తి విత్తనాల కోసమే కాకుండా ఎరువు కింద వాడే జీలుగ విత్తనాలకూ రైతులు ఆందోళన చేయాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జీలుగ విత్తనాలకే దిక్కులేకపోతే ఇక అసలు విత్తనాలు ఇస్తారని రైతుల్లో నమ్మకం ఎలా కలిగిస్తారని ప్రశ్నించారు. విత్తనాలు ఇవ్వలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని విడిచి ముఖ్యమంత్రి కేరళ, పంజాబ్, ఉప ముఖ్యమంత్రి పంజాబ్, మంత్రులంతా రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, విత్తనాల కొరత గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని, వానకాలం సాగునీటి విడుదలపై ఇంతవరకు సమీక్ష లేదని, ప్రచారం పుల్లు.. పాలన నిల్లు అన్నట్లుగా పరిస్థితి ఉందని విమర్శించారు.

### పచ్చిరొట్ట, జనుము, జీలుగ కోసం బారులు

వడ్లు, పత్తి, మక్క, సోయాబీన్ తదితర విత్తనాలే కాదు.. కనీసం పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాలు కూడా లేక అన్నదాతలు అరిగోస పడుతున్నారు. డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో మంగళవారం రాష్ట్రమంతటా మండుటెండలో వ్యవసాయ శాఖ కార్యాలయాలు, గోడౌన్లు, ఆగ్రోస్, డీసీఎమ్మెస్ దుకాణాలు, సహకార సంఘాల వద్ద పడిగాపులు కాశారు. గంటల తరబడి క్యూలో ఉండలేక పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డులు వరుసలో పెట్టి తమ వంతు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఏడీఏ కార్యాలయానికి పచ్చిరొట్ట విత్తనాల కోసం పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీస్ పహారా నడుమ టోకెన్లు, విత్తనాల పంపిణీ కొనసాగినా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన సొసైటీ కార్యాలయం ఎదుట పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు పొద్దంతా ఎదురుచూసినా దొరక్కపోవడంతో ఇంటిబాట పట్టారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ వ్యవసాయ గోడౌన్ ఎదుట రైతులు పచ్చిరొట్ట కోసం క్యూ కట్టడం కనిపించింది. ఎండకు తాళలేక పాస్‌బుక్ జిరాక్స్‌లు వరుసలో ఉంచారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లోని రెండు ఆగ్రోస్ కేంద్రాల వద్ద జనుము, జీలుగు విత్తనాల కోసం ఉదయం 6గంటల నుంచే లైన్లు కట్టారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌లను లైన్‌లో పెట్టి ఎదురు చూసినా రెండెకరాలకు ఒకటే బస్తా ఇవ్వడంతో గొణుగుకుంటూ వెనుదిరిగారు. చాలా మంది ఉత్త చేతులతోనే ఇండ్లకు వెళ్లారు. మెదక్ జిల్లా పాపన్నపేటలోని ఆగ్రోస్ సెంటర్, కొత్తపల్లి సహకార సంఘం వద్ద జీలుగ విత్తనాల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పలేదు. ఎండ తీవ్రంగా ఉండటంతో పాస్ పుస్తకాలను లైన్లో ఉంచి నిరీక్షించారు. ఖమ్మం జిల్లా బోనకల్‌లో ఓ విత్తన డీలర్ వద్ద ఉదయం నుంచే పత్తి విత్తనాల కోసం రైతులు క్యూకట్టినా దొరక్కపోవడంతో చాలామంది నిరాశతో వెనుదిరిగారు.

### పొద్దున ఆరు గంటలకు వచ్చిన..



నాకు 20 ఎకరాల భూముంది. కనీసం పది విత్తన ప్యాకెట్లు అవసరం. మూడు రోజుల నుంచి విత్తన ప్యాకెట్ల కోసం ఆదిలాబాద్ వచ్చిపోతున్న. ఇయ్యాల విత్తనాలు వస్తాయంటే పొద్దున ఆరు గంటలకే వచ్చిన. నేను వచ్చేసరికే ఇక్కడ పెద్ద లైన్ ఉంది. వృద్ధున్ని ఎండలో లైన్‌లో ఉండలేను అన్నా వినలేదు. లైన్‌లో ఉంటెనే విత్తనాలు ఇస్తామన్నరు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో ఎప్పుడూ విత్తనాల కోసం ఇంత గోస పడలేదు.

–స్వామి, రైతు, కుతులాపూర్, తలమడుగు మండలం, ఆదిలాబాద్ జిల్లా

### నాలుగ్గంటలు నెరివడితే రెండు ప్యాకెట్లు



మాకు తొమ్మిదెకరాల భూముంది. పత్తివిత్తనాల కోసం నాలుగు రోజుల నుంచి తిరుగుతున్న. ఇయ్యాల పొద్దుగాల ఏడు గంటలకచ్చి లైన్ కట్టిన. తిండి, తిప్పులు, నీళ్లు లేక ఎండలో నెరివడితే రెండు ప్యాకెట్లిచ్చింద్రు. నాకు ఐదు ప్యాకెట్లు కావాలంటే ఎక్కువ ఇయ్యమన్నరు. పత్తి విత్తనాలు మళ్ల అమ్ముతరో లేదో తెలుస్తలేదు. ఇంతకు ముందు విత్తనాలు మంచిగ దొరికినయ్. ఎన్ని కావాలంటే అన్ని తీసుకుపోయినం. ఇప్పుడెందుకిట్ల చేస్తున్నరో తెలుస్తలేదు.

– పుష్ప, రైతు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

### లాఠీచార్జి చేయలేదు



ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం వచ్చిన రైతులపై పోలీసులు లాఠీచార్జి చేయలేదు. పోలీసులు రైతులను చెదరగొట్టారనే విషయంలో నిజం లేదు. పంపిణీ కేంద్రాల వద్ద ఎలాంటి తోపులాట జరుగలేదు. దుకాణాల వద్ద రైతులను క్రమబద్ధీకరించేందుకే పోలీసులు విధులు నిర్వర్తించారు. రైతులు ప్రశాంత వాతావరణంలో విత్తనాలు కొన్నారు. తప్పుడు వార్తలు ప్రసారం చేసిన మీడియా ప్రతినిధులపై చర్యలు తీసుకుంటాం.

– ఎస్పీ గౌష్ ఆలం, ఆదిలాబాద్

### గడ్డుకాలం దాపురించింది



ఇప్పటి పరిస్థితి చూస్తుంటే మళ్లీ పాతరోజులు వచ్చినయనిపిస్తున్నది. పోయినేడు ఇట్ల లైన్లో నిలబడలేదు. ఇప్పుడు జీలుగ, జనుము విత్తనాల కోసం కూడా గంటల తరబడి నిలబడే దుస్థితి వచ్చింది. కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఇట్ల ఎప్పుడూ లైన్లో నిలబడే పరిస్థితి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇట్ల వచ్చిందో లేదో రైతులకు గడ్డుకాలం దాపురించింది.

–సొంగ వెంకటేశం, రైతు, పుల్కల్, సంగారెడ్డి జిల్లా

### ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 45.7°c | 27.0°c |
| నల్లగొండ | 43.2°c | 30.1°c |
| ఖమ్మం | 42.0°c | 31.0°c |
| మెదక్ | 40.6°c | 25.6°c |
| నిజామాబాద్ | 40.4°c | 28.4°c |
| రంగారెడ్డి | 40.3°c | 24.5°c |
| కరీంనగర్ | 40.0°c | 31.0°c |
| హైదరాబాద్ | 40.0°c | 29.0°c |
| వరంగల్ | 39.0°c | 31.0°c |
| మహబూబ్‌నగర్ | 39.0°c | 26.5°c |

### మరో 3 రోజులు పొడి వాతావరణం

- 2 నుంచి 3 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగే చాన్స్
- పలు జిల్లాలకు వర్ష సూచన

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పొడి వాతావరణం ఉండనున్నదని, ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీలు పెరగవచ్చని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. బుధ, గురువారాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీల మధ్య ఉండవచ్చని పేర్కొన్నది. నైరుతి రుతుపవనాలు రాగల 3 నుంచి 4రోజుల్లో కేరళలో ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా మారాయని ప్రకటించింది. బంగాళాఖాతంలో కల్లోలం సృష్టించిన రెమల్ తుఫాను తీరాన్ని తాకింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురవొచ్చని తెలిపారు. ఈ తుఫాను కారణంగా మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ, కామారెడ్డి, ఆదిలాబాద్, భద్రాద్రి, నిర్మల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

### దళారీ చేతిలో రైతుల దగా

- 204 క్వింటాళ్ల పత్తి విక్రయం
- 15 లక్షలు చెల్లించని వ్యాపారి

అలంపూర్, మే 28: ఓ దళారీ చేతిలో రైతులు మోసపోయిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. అలంపూర్‌కు చెందిన రైతు విజయ్‌కుమారెడ్డి తన పొలంతోపాటు కౌలుకు తీసుకున్న భూమిలో నిరుడు 40 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో పత్తిని నిల్వ ఉంచాడు. విజయ్ వద్ద నాలుగు లారీల పత్తి ఉన్నదని తెలుసుకున్న మానవపాడు మండలం జల్లాపురానికి చెందిన వ్యాపారి సతీశ్ సదరు రైతును సంప్రదించాడు. క్వింటా ధర రూ.7,200 చొప్పున బేరం కుదుర్చుకున్నాడు. మార్కెట్‌లో పత్తిని విక్రయించిన వెంటనే చెల్లిస్తానని నమ్మబలికాడు. ఈనెల 22న లారీలో తెల్లబంగారాన్ని నింపి రైతుతో కలిసి కర్ణాటకలోని రాయిచూర్ మార్కెట్‌కు తరలించి విక్రయించి డబ్బు చెల్లించాడు. మరుసటి రోజు రెండో లారీలో పత్తిని నింపారు. చీకటి పడటంతో తెల్లవారుజామునే వెళ్దామని వ్యాపారి చెప్పాడు. ఉదయం చూసే సరికి లారీ కనిపించలేదు. లారీ యజమాని, డ్రైవర్ ఇద్దరు కలిసి బళ్లారిలో పత్తి అమ్మినట్టు తెలుసుకున్న రైతు నాలుగు రోజుల తర్వాత వారిని నిలదీయగా.. వ్యాపారి సతీశ్ తనకు డబ్బులు బాకీ ఉన్నాడని, అందుకే పత్తిని అమ్మినట్టు చెప్పారు. ఈ మేరకు వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో సదరు వ్యాపారి మరో ఇద్దరు రైతులను కూడా మోసం చేసినట్టు తేలింది. ముగ్గురు రైతులు 204 క్వింటాళ్ల పత్తిని విక్రయించి రూ.15 లక్షల వరకు మోసపోయినట్టు సమాచారం. వ్యాపారిపై కేసు నమోదు చేస్తామని అలంపూర్ ఎస్సై నాగరాజు తెలిపారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్‌లో విషాదం

ఎల్కతుర్తి, మే 28: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో మంగళవారం చోటుచేసుకున్నది. బంధువుల కథనం ప్రకారం.. పెండ్యాల నాగరాజు (37)కు గ్రామంలో 7.25 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో వరి పంట వేశాడు. రెండేండ్లుగా పంట పెట్టుబడుల కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చలేనని మనస్తాపానికి గురైన నాగరాజు పొలం వద్ద వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి చూసేసరికి విగత జీవిగా కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజుకుమార్ తెలిపారు.

### సిద్దిపేట జిల్లా ఏవో సస్పెన్షన్

సిద్దిపేట, మే 28 : సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో లింగ వివక్షత చూపడం, ప్రభుత్వ ఉద్యోగిగా అతనిపై అనేక ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో నకిలీ విత్తనాలు తరలిస్తున్న వ్యాన్, ఇద్దరు నిందితుల అరెస్ట్ చూపుతున్న రామగుండం సీపీ, అధికారులు



వరంగల్ ఫోర్ట్ రోడ్‌లో పట్టుకున్న పత్తి విత్తన ప్యాకెట్లు

## చెన్నూర్‌లో నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- 16.50 లక్షల విలువైన 5.50 క్వింటాళ్లు సీజ్
- వరంగల్‌లో 3.67 లక్షల విలువైన పత్తి విత్తన ప్యాకెట్ల పట్టివేత

వరంగల్, మే 28(నమస్తేతెలంగాణ)/ ఫర్టిలైజర్ సిటీ: ఉల్లిగడ్డల బస్తాల కింద నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న వ్యాన్‌ను చెన్నూర్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రూ.16.50 లక్షల విలువైన 5.50 క్వింటాళ్ల నిషేధిత బీటీ–3 విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా వరంగల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3.67 లక్షల విలువైన పత్తి విత్తన ప్యాకెట్లను సీజ్‌చేశారు. వివరాలు ఇలా.. చెనూర్‌కు సంబంధించి రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ శ్రీనివాస్ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్ణాటకలో విత్తనాలు కొనుగోలు చేసి మహారాష్ట్ర నుంచి రామగుండం పోలీసు కమిషనరేట్ మీదుగా కొంత మంది నిషేధిత బీటీ–3 నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా రవాణా చేస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్సై లచ్చన్న సిబ్బందితో కలిసి మంగళవారం మంచిర్యాల్ జోన్‌లోని చెన్నూరు పరిధిలో గల బతుకమ్మ వాగు వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ వ్యాన్ ఆపి తనిఖీ చేయగా అందులో ఉల్లిగడ్డ బస్తాల కింద దాదాపు రూ.16.50 లక్షల విలువైన 5.5 క్వింటాళ్ల నిషేధిత బీటీ–3 విత్తనాలు బయటపడ్డాయి. అందులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు సీపీ తెలిపారు.

### వరంగల్‌లో అక్రమ నిల్వలపై దాడులు

వరంగల్‌లోని విత్తన దుకాణాలపై వ్యవసాయ శాఖ, పోలీసు టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు జరిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మేందుకు విత్తన డీలర్లు అక్రమంగా నిల్వ చేసిన రూ.3,67,100 విలువ గల పత్తి విత్తన ప్యాకెట్లను సీజ్ చేశారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓల్డ్ గ్రెయిన్ మార్కెట్ ప్రాంతంలోని రఘురామ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణంలో సరైన బిల్లులు, రికార్డులు చూపకుండా అక్రమంగా నిల్వ చేసిన రూ.2,72,160 విలువ గల యూఎస్ 7067 అనే బ్రాండ్‌కు చెందిన 315 పత్తి విత్తనాల ప్యాకెట్లను గుర్తించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏకశిలనగర్‌లో మేరీమాత సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని అల్లం విజయభాస్కర్‌రెడ్డి ఇంటి ఆవరణలో రూ.31,968 విలువ గల వివిధ బ్రాండ్లకు చెందిన 37 పత్తి విత్తన ప్యాకెట్లను, ఖిలావరంగల్ మండలం బొల్లికుంట రామకృష్ణాపురంలోని మహాలక్ష్మి సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణం యజమాని మల్లిపెద్ది దేవకుమార్ ఇంటి ఆవరణలో రూ.63,072 విలువ గల 73 పత్తి విత్తన ప్యాకెట్లను సీజ్ చేశారు.

## అందుబాటులో పత్తి విత్తనాలు

**రైతులు ఆందోళన పడొద్దు : వ్యవసాయ శాఖ**

హైదరాబాద్, మే 28(నమస్తే తెలంగాణ) : పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీజన్‌కు కావాల్సిన అన్ని రకాల పంటల విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కంపెనీలతో చర్చించి 1.26 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామని, 49.71 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంటే 9.20 లక్షల ప్యాకెట్లు విక్రయించామని పేర్కొన్నారు.

**జిల్లాల వారీగా పత్తి విత్తనాల వివరాలు**

| జిల్లా | అందుబాటులో ఉన్న ప్యాకెట్లు | జిల్లా | అందుబాటులో ఉన్న ప్యాకెట్లు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 545994 | ములుగు | 29510 |
| ఆసిఫాబాద్ | 277375 | భూపాలపల్లి | 29697 |
| మంచిర్యాల | 57392 | జనగామ | 150000 |
| నిర్మల్ | 209507 | ఖమ్మం | 216904 |
| నిజామాబాద్ | 1010 | కొత్తగూడెం | 166000 |
| కామారెడ్డి | 8809 | రంగారెడ్డి | 20351 |
| కరీంనగర్ | 201403 | వికారాబాద్ | 75968 |
| పెద్దపల్లి | 21684 | మేడ్చల్ | 30 |
| జగిత్యాల | 7192 | మహబూబ్‌నగర్ | 153147 |
| రాజన్న సిరిసిల్ల | 16311 | నారాయణపేట్ | 196800 |
| మెదక్ | 28551 | నాగర్‌కర్నూల్ | 226485 |
| సంగారెడ్డి | 276515 | వనపర్తి | 9964 |
| సిద్దిపేట | 132095 | గద్వాల్ | 97278 |
| వరంగల్ | 323718 | నల్లగొండ | 346063 |
| హన్మకొండ | 131620 | సూర్యాపేట | 25624 |
| మహబూబాబాద్ | 51675 | భువనగిరి | 9080 |
| | | హైదరాబాద్ | 7039 |
| | | మొత్తం | 4050791 |